# గూడెం పోకడ

ఓల్ మొత్తం పెపంచంమీన దడీమని లెగిసింది యుద్దెం. యాడ జూసినా మడుసులు వుసిమీన నడుత్తుండారు.

పాలెం ఆదర్నించి యీదరికి, సీకట్లో రాయీ రప్పా తన్నుకుంటా, సిరసిరలాడ్తా, బసవ పున్నయ్యగారు అంగలేసుకుంటా వొచ్చి, గూడెంలో నకా బూసాయి గుడిశ తలుపు సెక్కలమీన దబదబ బాదాడు "భూషాయ్, భూషాయ్?" అనరుత్తా.

తలుపుదీసి, పంచ సరిజూసుకుంటా బెయిటికిచ్చాడు బూసాయి కల్లు నలుసుకుంటా.

"ఎవురూ? మీరంటండి పున్నయ్యగారూ! లోనకి రాండి మంచమ్మీన కూకుందురుగాని-ఏవేఁయ్, లెగూ."

"ఇక్కడికి చాల్లే తిరిగింది. ఇంకా మంచమ్మీన కూచోటంగూడా, సిగ్గులేక! అవుతే ఏఁవిట్రా నీ వేషం భూషాయ్? ఇహ నీ చుట్టూతా తిరగటమే నాకు పననుకున్నావా ఏమిటీ?"

"పొద్దునొచ్చి పొయ్యారంటగా, ఇది సెప్పింది లెండి".

"పొద్దున్నే ఏమిటీ కర్మ! మున్నూటరవై ఘడియలూ మీ దేవిడీ కెదురుగానేగా నా రాంభజనా! నిన్నొచ్చి పోయినా, మొన్నొచ్చి పోయినా, దాం దుంపదెరిగి చావు, అంత కనబడకుండా పోయినామట్రా ఎంత రోజులు మారినా ఆ మాత్రం విశ్వాసం వుండక్కర్లా, మనిషన్నవాడికీ? పొయిలోకి పుడకలేక చస్తున్నాం. మొన్నటినుంచీ ఆ కట్టెలు పగలేసి వెళ్ళమని మాటిమాటికీ చెప్పి పోతుంటే, ఇవ్వాల్టివరకు తేలకపాయె! పోనీ దగ్గిర్లో పిలుస్తే పలికేవాడుంటే అనుకోవచ్చు. మా సొమ్ము ఎంతమంది తిన్నారో తింటున్నారో, ఎవడేడ్చాడు! 'ఏఁవిరా?' అనంటే, తొందర పనిమీద పోతున్నానండీ అని మొహం తప్పిచ్చేవాడే. మీ కుటుంబంమ్మీద వుండే నమ్మకం కొద్దీ, ఇదుగో యిట్టా ఏడుస్తుంటా! పోనీ, యీ నాటికి వీళ్ళు రోజుకు రూపాయో, రెండో సంపాదించుకుంటున్నారని

సంతోషంగా ఉంటుంది. నీకు రూపాయే కావాలో, రెండే కావాలో, ముందు పనిజేసి నీకు కావల్సినంతా పట్టుకుబో. నిన్ననేదెవరూ?"

"అంతేలెండి పున్నయ్యగారూ."

"అంతేనంటం కాదురా! నా పరిస్తితేమిటో నీకు తెలుసుగా? సొంతంగా యాడవలేక ఆ వున్నదంతా, ఇదిగో నీకూ, మీ గూడెంలో వాళ్ళకీ, తలా కొంచెం మక్తాకిస్తిని. సొంతంగా సాగించినన్నాళ్ళు, పిలుస్తే పలకటానికి మీలో ఎవరో జీతానికుండే వాళ్ళా, వెళ్ళిపోతుండేది. అసలు యీ రోగాల్తో బస్తీలకు పోతుంటంలో యీ ఖర్మ పట్టింది. పిల్లల కేవోఁ ఎక్కడో చదువులు, యిదేవోఁ రోగిష్టిది. పాపం, మా అమ్మ బతికున్నన్నాళ్ళూ ఏదో యింత చేసి పెట్టుండేది. యిహ, నేను మడే కట్టుకునేదా, దానికింత గంజే కాసేదా, కట్టెలే పగలగొట్టుకుంటూ కూచునేదా, మాట్లాడవేరా భూషాయ్?"

"చనక్కాయలకి పోతుండానండీ."

"ఒక్కరోజు భాగ్యానికి ఆ కూలీ నే నివ్వనన్నానుట్రా?"

"పదెకరాలు నలుగురం వొప్పుకోటంలో సిక్కొచ్చిందండీ. యిగ యాడ్డిలెండి, యియ్యాల్తో అదీ అవనే అయిపాయె."

"యిక్కడ నాకూ అయింది, తడిసి మోపెడు! తెల్లవార్జామున ఆవిడెగార్ని గుంటూరు తీసుకెళ్ళాలి. మధ్య మధ్య మన చేతిలో వున్న వైద్యమేమో చేస్తూ వొచ్చానూ– అది ఆవిడెగారికి చేదయింది! గుంటూర్లో లేడీడాక్టరు దగ్గిర తియ్యగా వుంటుందట. కానీ! యివ్వన్నీ మనకు అతీతం చూడూ! ఇందులో రేపు తెల్లవారే సుముహూర్తం. మరి నీ బండి కట్టుకొస్తావా, చుండూరు స్టేషనుకూ?"

"ఎట్టనండీ–"

"ఆఁ?"

"ఎట్టనండి పున్నయ్యగారూ, పెచ్చుందర్రామయ్యగారి ఆడోరు యడ్డపల్లి ఎల్తాఁ వంటే మాటిచ్చాను, ఎట్టనండీ!"

"వేళాకోళంట్రా భూషాయ్?"

"అబ్బె యంతొట్టు పడ్తే అంతొట్టండి! యెడ్డపల్లిలో అప్పయ్యగారి కూతురు సోబనం అయితే, ఆడోరెల్లాలంటా, గెట్టిగా తెల్లారి బండి కట్టకరామని సుందర్రామయ్యగారు సెప్పి పొయ్యారండీ."

"భూషాయ్? మీరు చిన్నప్పుడు మా యింట తిని పెరిగారు. మీ నాయన మా ఇంటో జీతానికి చేస్తూ దాటిపొయినాడు. ఇవాళ రోజులు మారినయ్యని నే నంటంలా. ఇప్పటికీ మా తాటితోపులో, మీరేగాదు, వూళ్ళో వాళ్ళంతా మట్టల్దగ్గిర్నుంచీ సమస్తం తీసుకెల్తుంటే నాకు తెలిసికూడా పల్లెత్తుమాట అనలా. రెణ్నెల్ల కిందట నీ పెళ్లాం చలిజ్వరంతో బాధపడ్తుంటే నాకు తోచిన మందేదో యిచ్చి నయం జేశా. ఇహ ఎన్నో వున్నయి, ఎందుకొచ్చినట్టు. ఈనాడు పెళ్ళానికి జబ్బుగా వున్నదని సిగ్గులేక నీ బండికి బతిమాల్తుంటే - వాళ్ళు అయిదిచ్చినా పదిచ్చినా - నాకు మొహం తిప్పి చూపిస్తావ్రా భూషాయ్?"

"అబ్బె ఎంత మాటండి పున్నయ్యగారూ! యద్దపల్లి నుంచి మద్దానం తిరిగొచ్చి, సందేల కట్టుకురామంటే కట్టుకొత్తా-"

"నీ మ్మొహాన కొట్టుకో-ఛీ-తూ-" అని సీదరిచ్చుకుంటా, సీకట్లోకి గబ గబ ఎల్లిపొయ్యాడు బసవ పున్నయ్యగారు.

కాసేపు అట్టనే నిలబడ్డాడు బూసాయి.

"ముంగల తలుపెయ్యి" అంది పెల్లాం సుక్కమ్మ.

"యివకడ మడ్చి మాటినిపిచ్చుకోడేం!" అన్నాడు బూసాయి, సుక్కమ్మ పక్క కూకుంటా.

"ఏందయ్యా యిచ్చిపిచ్చుకునేది? మద్దె నా కెందుకని వూరుకుండాగాని, ఆవజాన పున్నయ్యగారు బతివిఁలాడ్తుంటే కొయ్యకిమల్లే అట్టనే నిలబడిపోతివీ? మాట దక్కే యవారవేఁ నెట్టా యిదీ?"

"ఓడన్నాడు దక్కుద్దనీ!"

"అయిదూ, పదీ, యిత్తాడెట్టా పెచ్చుందర్రామయ్యగారూ!"

"పదా, యాబయ్యా?"

"మరేంది పున్నయ్యగా రావజానంటంటే?"

"అచలు-ముంగల మడ్చికి మాటిత్తిని గదంటే!"

"ఇత్తే ఇచ్చావులే, ఆరి సొమ్ము దిన్నాం. నాయం గుండదు ఎల్లిరా."

"ఆ మాత్రం నాయం యీ యదవకు తెలిత్తేనా, నీకు తెల్చింది గానీ! ముంగలో పెద్దమడ్సికి మాటిత్తినీ, మద్దానం ఎటనో తిరిగొచ్చి, కాత్తె ఆగి బండి కడ్తానంటుంటినీ, దుత్త పగలేసి నట్టెల్లిపాయె!"

"ఎన్నాలు బొయినా పీడ మన మీనకే వొచ్చిద్ది! ఆయనేవోఁ ఆనాడు మీరు మా సొమ్ము దిన్నారు, యీనాడు మీకు మందుబోశాను, అనంటుండె! ఓరు కాదన్నారూ? లెగవరా, అంటే లెగవడానికి యివకాడ మడిసి సిక్కులు గమనియ్యక్కర్లా?"

"అవకాడ బో సంబరమ్మీన, సోబనాని కెల్లాల బండికట్టరా అంటే, కద్దానంటిని!"

"కూలీ దొరకనన్నాలు కూడులేక సత్తావుంటే, 'గాద్దెకొడుకులు పన్జేసి సావరు' అనంటిరి! యియ్యాల కూలి గిరాకయి ఆడీడకు బొయి నాలుగు డబ్బులు తంటా బద్దంటే, 'యిస్వాసం లేదీళ్ళకి' అనంటుంటిరి!"

"ఓ రోజు పేళ్లు పగలెయటానికి పద్దినాల కూలి పోనూకమంటాడు. నాయం వుండక్కర్లా?"

"... ... ..."

"... ... ..."

"ముంగల తను వొప్పందం జేసుకునుంటే, ఆనక పద్దినాలపని పోయిందని ఏడుత్తే ఏడ్సుకుండేవోళ్ళం."

"కాదులే!"

"ఏంది కాదూ?"

"ఆ మద్దె రామయగారు 'దడి బిగిత్తావంట్రా రూపాయిన్నరిత్తానూ?" అనంటే, పని కొప్పుకున్నానండీ, అనలా. అన్నీ వుత్తదే!"

"అదేందీ! డబ్బు ఎక్కువై పోతుండదెట్టా?"

"అనాల్చి అన్నా లేయే!"

"యిదేందీ! యీ మద్చికేం గుబు లెట్టా!"

"ఎవురికి నాకా? నువ్వనాల్చిందే! ఆమైన బామ్మనయ్యగారి సందులోకి ఎల్లేతలికీ, అదిగో ఆ పద్దినాల రెడ్డమ్మగారి కూలి దొరికింది."

"నీకు ముంగల తెల్చా, అవజాన కలిసొచ్చుద్దనీ? యింకా నయం అట్ట సెయిమాక ఎప్పుడూ."

"ఇన్నాలమించి మన్ని ఏడిపిత్తే బాగుండ దెట్టా? నువ్వేగా యింతకి ముందలంటివీ?"

"నేనన్నానెట్టా? ఏవోఁ. అయినా పెద్దోరితో కూడినెవారం. రేపు మనకి గడ్డు

దినాలొత్తే, ఆరేగందా మనకి దిక్కు? కాత్తె కనిబెట్టి పోయ్యా, బాగుంటదీ."

"దిక్కు! ఓరే మనకి దిక్కు? దిక్కుంటే, పగలల్లా, రేత్రల్లా వొల్లు యిరుసుకున్నా కడుపు కక్కుర్తిగుంటదేం? ఈపుమీన బత్తాఎత్తుకుంటే కూలి డబ్బు లిత్తుంటారు. యీ మయిన నువు ఎల్లి పట్టుకోక కావాలని అడుగూ, ఓడిత్తాడో సూద్దాం? యియ్యాల నువు రూపాన్నర సంపాయిత్తుండా, మరసనాడు పడకేత్తే దానికది చరీపోటం లేదంటే? గడ్డు దినాలు యాడో వుండయ్యంటావేందే? రోజూ కూలిగిద్దుండదీ. అదీ సావుగా వుంటే యిగ ఎవురే నిన్ను కనిబెట్టుండేదీ?"

"నీకేందో గుబులు మల్లింది!"

"పాయే!"

"సందుసూసి యాడో పిసుకుతాళ్ళే పున్నయ్యగారు!"

"ఓడు కాదన్నాడు శాతకాదనీ? ఓకోపు నువుగూడా పట్టు"

"యిగ సాల్లే వూరుకో!"

"ఏమ్మా?"

"యియ్యాలకి పొండుకో, తెల్లారి సోబనాని కెల్లాల గూడా."

"ఏందో అంటండావే-?"

"అబ్బోబ్-"